క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణంలోని గాంధీనగర్, ఇస్లాంపురం, డాక్టర్స్‌కాలనీ, షాబునగర్, సీతారాంపురం, చర్చిరోడ్డు ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ కోడిరెక్క రవికుమార్ శనివారం తెలిపారు. పట్టణంలోని సబ్‌స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన అదనపు ట్రాన్స్‌ఫార్మర్ బిగింపులో పెండింగ్ పనులు చేస్తున్నందున విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. గృహ, వ్యాపార విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రంజాన్ కిట్ల పంపిణీ



రంజాన్ కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్

దేవరకొండ: దేవరకొండ పట్టణంలోని మక్కా మసీద్‌లో ఈద్గా, మక్కా మసీద్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రంజాన్ కిట్లను శనివారం ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈద్గా కమిటీ అధ్యక్షుడు అజీం, మతపెద్ద మౌలానా మాజిద్, ఎంఏ సిరాజ్‌ఖాన్, జాల నర్సింహారెడ్డి, వైస్ చైర్మన్ రహత్‌అలీ, ఖదీర్, యూసుఫ్, మోయిన్, ఖాజా, నవీద్, ఇస్మాయిల్, కమిటీ సభ్యులు తదితరులున్నారు.

ఒలింపియాడ్ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ

మిర్యాలగూడ టౌన్: పట్టణంలోని ప్రకాశ్‌నగర్‌లో గల నీరజ స్కూల్‌లో ఇటీవల హైదరాబాద్‌కు చెందిన అపెక్స్ ఒలింపియాడ్ నిర్వహించిన పరీక్షల్లో పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు కరస్పాండెంట్ రాజు శనివారం తెలిపారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎస్‌కె ఫజీల్, సాయి, విఘ్నేశ్, సందేశ్, ఎస్‌కే సాల్మన్, త్రినియానలతో పాటు మరికొంత మంది విద్యార్థులు మెడల్స్, సర్టిఫికెట్లు అందుకున్నట్లు పేర్కొన్నారు.

రిజర్వేషన్ల పరిమితి ఎత్తివేస్తామని ప్రకటించడం హర్షణీయం

మిర్యాలగూడ టౌన్: కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 50శాతం రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేస్తామని మేనిఫెస్టోలో పేర్కొనడంపై బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించాలి



మెడల్స్, సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో ఎంఈఓ బాలాజీ నాయక్

మిర్యాలగూడ అర్బన్: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు ఉన్నత విద్య వైపునకు మళ్లించేలా సన్నద్ధం చేయడం ద్వారా వారిలో ఆత్మ విశ్వాసం పెంపొందించవచ్చని ఎంఈఓ బాలాజీ నాయక్ తెలిపారు. శనివారం మిర్యాలగూడ పట్టణంలోని రెడ్డీకాలనీలో గల డౌహిల్ హైస్కూల్‌లో నిర్వహించిన కాన్వకేషన్ డేలో ఆయన మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సాయిశ్రీనివాస్, ప్రిన్సిపాల్ శ్రీకాంత్‌బాబు పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

త్రిపురారం: రంజాన్ మాసం సందర్భంగా త్రిపురారం మండల కేంద్రంలోని మసీద్‌లో శనివారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్ రెడ్డి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జంగిలి శ్రీనివాస్, మైనార్టీ అధ్యక్షుడు షేక్ దస్తగిరి, శ్యాంసుందర్‌రెడ్డి, నగిరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మట్టపల్లిలో నారసింహుని నిత్యకల్యాణం

మఠంపల్లి : మట్టపల్లిలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని శనివారం అర్చకులు వేదమంత్రాలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిత్యహోమం పూర్తిగావించి శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అందంగా ముస్తాబు చేసి ఎదుర్కోళ్ల మహోత్స సంవాదం రసవత్తరంగా రక్తిగట్టించారు. అదేవిధంగా కల్యాణ తంతులో భాగంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణను నిర్వహించారు. అదేవిధంగా శ్రీస్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై ఆలయ తిరుమాఢ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు కృష్ణానదిలో పుణ్యస్నానాలు చేసి శ్రీస్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లి రావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఇంకుడుగుంతలను గాలికొదిలేశారు!

- నిరుపయోగంగా మారిన ఇంకుడు గుంతలు
- నిర్వహణ బాధ్యత మరిచిన అధికారులు

మిర్యాలగూడ టౌన్: భూగర్భ జలాలు పెరిగేందుకు ఉపకరించే ఇంకుడు గుంతల నిర్వహణ మిర్యాలగూడ మున్సిపాలిటీలో పూర్తిగా మరిచిపోయారు. వాటి కోసం తమ వంతు ప్రయత్నం చేయాల్సిన అధికారులు గడిచిన ఏడేళ్లల్లో ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. వేసవి కాలం రాక ముందు ఎక్కడెక్కడ ఇంకుడు గుంతలు తవ్వాలో గుర్తించి స్థలాలను ఖరారు చేసేవారు. ఎండాకాలం ప్రారంభంకాగానే ఆయా స్థలాల్లో వాటిని ఏర్పాటు చేసేవారు. వర్షాకాలం నాటికి అవన్నీ సిద్ధంగా ఉండటంతో వర్షపు నీరంతా వాటిలోకి వెళ్లి భూగర్భ జలాలు పెరిగేవి. నేడు ఇంకుడు గుంతలు పలు ప్రాంతాల్లో నిరుపయోగంగా మారిపోగా, మరికొన్ని ప్రాంతాల్లో శిథిలావస్థలోకి చేరాయి.

ఎందుకింత నిర్లక్ష్యం..

గతంలో మున్సిపల్ అధికారులు ఇంకుడు గుంతల ఏర్పాటులో కాలనీ వాసులను భాగస్వాములను చేశారు. భూగర్భ జలాల సంరక్షణకు కాలనీవాసులు ముందుకు వస్తే తాము ఇంకుడు గుంతలను



మిర్యాలగూడ పట్టణంలోని చేతి పంపు వద్ద ధ్వంసమైన ఇంకుడు గుంత

ఏర్పాటు చేస్తామని, వాటి సంరక్షణ ఇంటి వద్ద అయితే ఇంటి యాజమాని, చేతి పంపుల వద్ద, మంచినీటి ట్యాంకుల వద్ద అయితే కాలనీ సంఘాలు, ప్రతినిధులు చూడాల్సి ఉంటుంది. ఈ మేరకు ఇంకుడు గుంతలపై ఆసక్తి ఉన్నవారు నేరుగా ఆయా శాఖలకు దరఖాస్తులు చేసుకుంటే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చేవారు. గతంలో ప్రతి చేతి పంపు వద్ద, బోర్లు, ట్యాంకులు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేశారు. ఇప్పుడు కొన్ని ప్రాంతాల్లో అవి పూర్తిగా ధ్వంసం కాగా మరికొన్ని ప్రాంతాల్లో రోడ్లు వేయడంతో చాలా ఇంకుడు గుంతలు కనబడకుండా పోయాయి. ఇప్పుడు ప్రతి ఇంటికీ ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసే పరిస్థితి లేకుండా పోయింది. కాగా.. ప్రస్తుతం మున్సిపాలిటీలో అపార్ట్‌మెంట్లు, ఫంక్షన్ హాళ్లలో 40 ఇంకుడుగుంతలు ఉంటే వాటిని పట్టించుకోకపోవడంతో ఇప్పటివరకు 30 మందికి మున్సిపల్ శాఖ నుంచి నోటీసులు కూడా జారీ చేశారు.

ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి



ప్రస్తుతం భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోతున్నందున తప్పనిసరిగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి. ఇంకుడు గుంతల ఏర్పాటుపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటాం. అదేవిధంగా పలు అపార్ట్‌మెంట్, ఫంక్షన్‌హాళ్ల వారికి ఇంకుడు గుంతల ఏర్పాటు విషయంపై 30 మందికి నోటీసులు కూడా జారీ చేశాం.

– మహ్మద్ యూసుఫ్, మున్సిపల్ కమిషనర్, మిర్యాలగూడ

అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ వేడుకలు



బాల్నేపల్లిలో గల అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ వేడుకలు

అడవిదేవులపల్లి: మండలంలోని బాల్నేపల్లి గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అభ్యసించిన పిల్లలు మానసికంగా, శారీరకంగా ఎంతో అభివృద్ధి, ప్రాముఖ్యతతో ఉంటారని తెలిపారు. పిల్లల నైపుణ్యత గుర్తించి వారికి ప్రోగ్రెసివ్ కూడా అందించడం జరుగుతుందన్నారు. సమావేశంలో అంగన్‌వాడీ టీచర్లు కుమారి, లలిత, హెల్పర్లు రంగమ్మ, రమణమ్మ, ఆశ వర్కర్లు, బాలింతలు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ సాగర్ నియోజకవర్గ అధ్యక్షుడిగా రమేష్

హాలియా: బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) నాగార్జున సాగర్ నియోజకవర్గ అధ్యక్షుడిగా గుర్రంపోడు మండలం చేపూర్ గ్రామానికి చెందిన కొమ్ము రమేష్ నియామకమయ్యారు. శనివారం హాలియా పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన బీఎస్పీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజారావు కొమ్ము రమేష్‌కు నియోజకవర్గ అధ్యక్షుడిగా నియామకపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. బీఎస్పీ సాగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తక్కెళ్లపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో బీఎస్పీ జిల్లా మహిళా కన్వీనర్ కొండ లలిత, నాయకులు మురళి తదితరులు పాల్గొన్నారు.



రమేష్‌కు నియామకపత్రం అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు రాజారావు

ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలి



ఆర్డీఓ శ్రీనివాస్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న ధర్మ సమాజ్ పార్టీ నాయకులు

మిర్యాలగూడ: మిర్యాలగూడ రెవెన్యూ డివిజన్ పరిధిలోని అనుముల మండలం ఇబ్రహీంపేట్ గ్రామ శివారులోగల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని ధర్మ సమాజ్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తరి ఎల్లయ్య కోరారు. ఈమేరకు శనివారం ఆర్డీఓ శ్రీనివాస్‌రావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇబ్రహీంపేట్ గ్రామ శివారులో నాగార్జునసాగర్ ఎడమకాల్వ నిర్మాణ సమయంలో ప్రభుత్వం సేకరించిన సర్వే నంబర్లు 16, 17, 68, 72లలో సుమారు 451 ఎకరాలను కొంతమంది తమ ఆధీనంలో పెట్టుకున్నారని ఆరోపించారు. ఈ విషయంపై గతంలో కలెక్టర్, అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదులు చేసినట్లు తెలిపారు. ఎస్ఎస్పీ భూములను సర్వే చేయించి ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పేద ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్‌బాబు, జిల్లా ఇన్‌చార్జ్ రాంబాబు, నాయకులు శ్రీను, వెంకన్న, జగన్, రాజశేఖర్, సైదులు, రవి, జగన్, కల్యాణ్, వంశీ, మహేష్, శంకర్, వెంకటయ్య పాల్గొన్నారు.

కేంద్రంలో మళ్లీ బీజేపీదే అధికారం



డిండి: టిఫిన్ బైటక్ కార్యక్రమంలో పాల్గొన్న గంగిడి మనోహర్‌రెడ్డి



మిర్యాలగూడలో బీజేపీ జెండా ఆవిష్కరిస్తున్న పట్టణ అధ్యక్షుడు తుమ్మలపల్లి హన్మంతరెడ్డి

డిండి: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ మరోసారి గెలిచి నరేంద్రమోదీ ప్రధాని కావడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శనివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని డిండి మండల కేంద్రంలో టిఫిన్ బైటక్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ కార్యవర్గ సభ్యుడు లాలూనాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, దేవరకొండ అసెంబ్లీ కన్వీనర్ ఏటి కృష్ణ, సాయికుమార్, కొండల్, భాస్కర్, రాఘవేంద్ర, అంజి, అమృత్, సాయి, శ్రీను, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ పట్టణంలో శనివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా హౌజింగ్‌బోర్డులో సాధినేని శ్రీనివాస్‌రావు, వాసవినగర్ కాలనీలో పట్టణ అధ్యక్షుడు తుమ్మలపల్లి హన్మంతరెడ్డి పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం టిఫిన్ బైటక్ నిర్వహించారు. వారు మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డిని గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రేపాల పురుషోత్తంరెడ్డి, మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొండేటి సరిత, నాయకులు కొండేటి శేఖర్, రవికుమార్, పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, దొండపాటి వెంకట్‌రెడ్డి, రాపర్తి శ్రీనివాస్, శ్రీధర్, రామకృష్ణారెడ్డి, రామచంద్రారెడ్డి, నాగిరెడ్డి, తక్ళం అశోక్, గుండా రామ్మూర్తి, మంద శివ, నక్క రవిబాబు తదితరులున్నారు.

దేవరకొండ: దేవరకొండలో శనివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు బూత్‌లలో ఇళ్లపై బీజేపీ జెండాను బూత్ అధ్యక్షుడు ఆవిష్కరించారు. అనంతరం టిఫిన్ బైటక్ నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కర్నాటి సురేష్, కేతావత్ లాలునాయక్, నియోజకవర్గ కన్వీనర్ ఏటి కృష్ణ, బెజవాడ శేఖర్, ఉప్పల వెంకటేష్, నక్క వెంకటేష్, వనం సాంబయ్య, వస్కుల సుధాకర్, సముద్రాల సహదేవ్, ప్రమోద్, ఇడెం రవి, జల్ద భాస్కర్, గీతారాణి, అప్పం అజయ్, పోలగోని గణేష్ తదితరులున్నారు.

చింతపల్లి: బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం చింతపల్లి మండల కేంద్రంలోని 33, 34, 35 బూత్‌లలో ఇళ్లపై పార్టీ ఆధ్వర్యంలో బీజేపీ జెండా ఎగురవేశారు. అనంతరం టిఫిన్ బైటక్ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమోని రాములు, నాయకులు కుకుడపు రామకృష్ణ, వెన్నం శేఖర్, సముద్రాల నగేశ్, శివకుమార్, చెన్నయ్య, బొడ్డు మహేశ్, మహేందర్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలి

మాడుగులపల్లి: బీజేపీ బలోపేతమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని ఆ పార్టీ కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి గడ్డం వెంకట్‌రెడ్డి అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం మాడుగులపల్లి మండలంలోని చెరువుపల్లి గ్రామంలో బీజేపీ కార్యకర్తలతో కలిసి పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం టిఫిన్ బైటక్ కార్యక్రమంలో భాగంగా ఆయన స్థానిక బీజేపీ కార్యకర్తలతో సమావేశమై పార్టీ స్థితిగతులపై చర్చించారు.



దేవరకొండ: టిఫిన్ బైటక్ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు



చింతపల్లి: టిఫిన్ బైటక్ కార్యక్రమంలో బీజేపీ నాయకులు

ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కాంగ్రెస్



మిర్యాలగూడ: దీక్షలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు తదితరులు



హాలియా: రైతు దీక్షలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే భగత్, ఎమ్మెల్సీ కోటిరెడ్డి

- మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు

మిర్యాలగూడ: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలు అనుసరిస్తోందని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ఆరోపించారు. శనివారం మిర్యాలగూడ పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలో ఆయన మాట్లాడారు. నల్లగొండ జిల్లాలో బత్తాయి తోటలు నీళ్లు లేక ఎండిపోతున్నాయని, ఎడమకాల్వ ద్వారా చెరువులను, కుంటలను నింపితే తోటలు బతికే అవకాశం ఉందన్నారు. అనంతరం ఆర్డీఓ శ్రీనివాస్‌రావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు మోసిన్‌అలీ, వేములపల్లి, మాడ్గులపల్లి, మిర్యాలగూడ బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, పాలుట్ల బాబయ్య, మట్టపల్లి సైదులుయాదవ్, నాయకులు నామిరెడ్డి యాదగిరిరెడ్డి, అన్నభీమోజు నాగార్జునచారి, హాతీరాంనాయక్, బాలాజీనాయక్, రాములుగౌడ్, ఏడుకొండలు, ఎండీ షోయబ్, భిక్షం, వీరకోటిరెడ్డి, మల్లేష్‌గౌడ్, నర్సింహారెడ్డి, గోపాలకృష్ణ, బాసాని గిరి, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రూ.500 బోనస్ ఇవ్వాలి

హాలియా: యాసంగి సీజన్‌లో రైతులు పండించిన వరి ధాన్యం క్వింటాకు రూ. 500 బోనస్ ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ట్రైకార్ మాజీ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని, సాగర్ ఎడమ కాల్వకు నీటిని విడుదల చేసి చెరువులను నింపాలని డిమాండ్ చేస్తూ మాజీ సీఎం కేసీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించడం లేదని, విద్యుత్ కోతలు మొదలయ్యాయని అన్నారు. అనంతరం తహసీల్దార్ జయశ్రీని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పెద్దవూర ఎంపీపీ చెన్ను అనురాధ సుందర్‌రెడ్డి, వివిధ మండలాల అధ్యక్షులు కూరాకుల వెంకటేశ్వర్లు, పిడిగం నాగయ్య, సత్యపాల్, రవినాయక్, పట్టణ అధ్యక్షుడు వడ్డె సతీష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అల్లి పెద్దిరాజు యాదవ్, నాయకులు అనుముల శ్రీనివాస్‌రెడ్డి, కామర్ల జానయ్య, ఆంజాద్‌ఖాన్, జలీల్ పాషా, సురభి రాంబాబు, లక్ష్మణ్ యాదవ్, పగడోజు సైదాచారి, ఆంజనేయులు, మాజీ సర్పంచ్‌లు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలి

హాలియా: ప్రజా, రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు లోక్‌సభ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. శనివారం హాలియా పట్టణంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ట్రైకార్ మాజీ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్‌తో కలిసి మాట్లాడారు. ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వంద రోజుల్లో చేసిందేమీ లేదని ఆరోపించారు. సాగర్ నియోజకవర్గంలో కొంతమంది బీఆర్‌ఎస్ నాయకులు పార్టీ మారినంత మాత్రాన నష్టమేమీ లేదని, ప్రజలందరూ కేసీఆర్ వైపే ఉన్నారన్నారు. కార్యక్రమంలో వివిధ మండలాల అధ్యక్షులు కూరాకుల వెంకటేశ్వర్లు, పిడిగం నాగయ్య, సత్యపాల్, రవినాయక్, పట్టణ అధ్యక్షుడు వడ్డె సతీష్‌రెడ్డి, నాయకులు అనుముల శ్రీనివాస్‌రెడ్డి, కామర్ల జానయ్య, సురభి రాంబాబు, గుండెబోయిన వెంకన్న, ఉర్లగొండ వెంకటయ్య, లక్ష్మణ్ యాదవ్, పగడోజు సైదాచారి తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

దేవరకొండ: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. శనివారం దేవరకొండ పట్టణంలోని బస్టాండ్ వద్ద రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన రైతు దీక్షలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఆచరణకు సాధ్యం కాని హామీలిచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని ఆరోపించారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, రైతుబంధు రూ.15వేలు, రైతు కూలీలకు రూ.12వేలు, కౌలు రైతులకు రూ.15వేలు ఇస్తామని చెప్పి ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. వంద రోజుల కాంగ్రెస్ పాలనలో 200మంది రైతులు చనిపోయారని, బాధిత కుటుంబాలను ఏ ఒక్క మంత్రి పరామర్శించలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు గాజుల ఆంజనేయులు, బిల్యానాయక్, పల్లా ప్రవీణ్‌రెడ్డి, టీవీఎన్ రెడ్డి, రమేష్‌నాయక్, బాబా, జానీబాబా, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులున్నారు.



దీక్షలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్, పాల్గొన్న బీఆర్‌ఎస్ నాయకులు

200 రోజుల 'ఉపాధి' కల్పించాలి



సభ్యత్వం అందజేస్తున్న నాయకులు

హుజూర్‌నగర్‌రూరల్ : జిల్లా వ్యాప్తంగా కరువు పరిస్థితులు ఉన్నందున ప్రభుత్వం ఉపాధి హామీ కూలీలకు 200 రోజుల పని దినాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు కోరారు. శనివారం మండలంలోని అమరవరంలో వ్యవసాయ కార్మిక సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. హుజూర్‌నగర్ ప్రాంత ప్రజలు తాగు నీటి కోసం ఇబ్బందులు పడుతుంటే వారిని పట్టించుకోకుండా సాగర్ జలాలను ఖమ్మం జిల్లాకు తరలించడం సరైన పద్ధతి కాదని అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఆయకట్టు పరిధిలోని చెరువులు, కుంటలను నింపి తాగునీటి ఎద్దడిని నివారించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను, ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీను, పోషణబోయిన హుస్సేన్, కాశీం, సైదా, రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమమే పీఆర్‌టీయూ ధ్యేయం

అడవిదేవులపల్లి: ఉపాధ్యాయుల సంక్షేమమే పీఆర్‌టీయూ(టీఎస్) ధ్యేయమని ఆ సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పసుల కాశీయాదవ్ అన్నారు. శనివారం అడవిదేవులపల్లి మండల కేంద్రంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు అంబటి శ్రీను అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం బలోపేతానికి కృషి చేయాలన్నారు. జిల్లా కమిటీ ఆదేశాల మేరకు మొల్కచర్ల ఎంపీయూపీఎస్ పాఠశాల ఉపాధ్యాయుడు గోపిని జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించినట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు గుడిపాటి కోటయ్య, మండల ప్రధాన కార్యదర్శి కపూర, సుంకరి శ్రీనివాస్, సోమలింగం, సురేష్, నర్సిరెడ్డి, రంగారెడ్డి, శ్రీనివాస్, ప్రదీప్, మధుసూదన్‌రెడ్డి, లక్ష్మీప్రసన్న, రమాదేవి, వీరేష్, కృష్ణయ్య, రామ్మూర్తి, వీరబాబు, రామకృష్ణ, వెంకట్‌రెడ్డి, రవికుమార్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కాశీ యాదవ్

చర్మ సంరక్షణపై అవగాహన

నల్లగొండ రూరల్: ప్రపంచ చర్మ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని చర్లపల్లిలో శనివారం గ్రామస్తులకు కామినేని వైద్య కళాశాల ఆధ్వర్యంలో చర్మ సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కామినేని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ శృతి మహంతి మాట్లాడుతూ.. చర్మంపై మచ్చలు, రంగు మార్పు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. చర్మ సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వైద్యులు బాలరాజు, అశోక్‌దేవ్, నేహా, నవనీత, దివ్య ,శ్రీముఖి, బి. దివ్య, అమీనా నాజ్, రమేష్, నగేష్, దేవకుమారి తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వైద్యులు

ఓబీసీ మోర్చా జిల్లా కమిటీ నియామకం

నల్లగొండ టూటౌన్: బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా కమిటీని ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పిట్టల శ్రీనివాస్ శనివారం ప్రకటించారు. జిల్లా ఉపాధ్యక్షులుగా నారాయణ చండీశ్వర్, కంప దుర్గయ్య, దుబ్బాక మల్లేష్, చిట్టిమల్ల శివకుమార్, మునికుంట్ల గణేష్, కొండేటి శేఖర్, ప్రధాన కార్యదర్శులుగా తిరందాసు కనకయ్య, నేతాల వెంకటేశ్‌యాదవ్, కార్యదర్శులుగా తిరుమల మహేష్, కసిరెడ్డి ఆంజనేయులు, బంటు యాదగిరి, కిలారి సైదులు, వంగూరు సైదులు, ఝెన్నం శేఖర్, పోకల దశరథ, కురాకుల రవీందర్‌కుమార్, కోశాధికారిగా బోడ ఆంజనేయులు, సోషల్ మీడియా కన్వీనర్‌గా పంజాల నాగరాజు, కార్యాలయ కార్యదర్శిగా ఆవుల కోటేష్, అధికార ప్రతినిధులుగా సోమగాని దినేష్‌గౌడ్, కుంభం సైదయ్య నియామకమయ్యారు.

స్వయం ఉపాధిపై శిక్షణ

నల్లగొండ టౌన్: రేకల అన్నమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణంలోని గ్రేస్ ఇవాంజిలికల్ బాప్టిస్ట్ చర్చిలో శనివారం నిరుద్యోగ యువతులకు ఫినాయిల్, సబ్బులు, జెండూబాం, వ్యాజిలిన్ తయారీపై రెవరెండ్ పి. జాన్‌బాబు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ఫౌండర్, అధ్యక్షుడు రేకల భద్రాద్రి మాట్లాడుతూ.. ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు రేకల శైలజ, రేఖల సునీల్, సుధామ్స్, రెవరెండ్ డాక్టర్ కె. మోజస్, రెవరెండ్ కె. యేవేలు, కె. శేఖర్, పాస్టర్లు వసంత కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఫినాయిల్, సబ్బుల తయారీపై శిక్షణ ఇస్తున్న రెవరెండ్ జాన్‌బాబు

హక్కుల పరిరక్షణకు కార్మికవర్గం ఏకం కావాలి

నల్లగొండ టౌన్: తమ హక్కుల పరిరక్షణ కోసం కార్మికవర్గం ఏకం కావాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సలీం, జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య పిలుపునిచ్చారు. శనివారం సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు బీటీ రణదీవె వర్ధంతి సందర్భంగా నల్లగొండ పట్టణంలోని హమాలీ యూనియన్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికుల హక్కులను కాలరాస్తున్న బీజేపీకి లోక్‌సభ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు. కార్యక్రమంలో అద్దంకి నర్సింహ, పోలె సత్యనారాయణ, సైదాచారి పాల్గొన్నారు.



రణదీవె చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు